# కట్నంలేని పెళ్లి

## ఇసుకపల్లి లక్ష్మీనరసింహశాస్త్రి



టాక్సీ పోర్టికోలోకి వచ్చి యిట్టే ఆగిపోయింది. చప్పున శివకామయ్య దిగేసి, గిర్రున తిరిగి, కుడివైపు డోర్ తీసి 'రండి' అన్నాడు.

సంతానలక్ష్మి ఒక్క క్షణం ఆగి, హేండ్ బాగ్ బుజానికి తగిలించుకుని, కుడికాలు క్రింద పెట్టింది. ఆమె నిటారుగా నిలబడే లోపుగానే శ్రీధర్ కూడ చకచక దిగేసి ఆమె వెనకాలే నిలబడ్డాడు.

జస్ట్ వన్ మినిట్ అంటూనే, శివకామయ్య టాక్సీమీటరు కళ్లజోడు తీసి మరీ చూస్తున్నాడు. ఆరు రూపాయలయితే స్పష్టంగానే కనిపిస్తోంది గాని, పైసల దగ్గరే తికమకపడుతున్నాడు. ఇరవై అయిదా, డెబ్భైఅయిదా అనే అనుమానం తీరటంలేదు. టాక్సీడ్రైవర్ని అడుగుతే డెభ్భైఅయిదు అనటంతో సందేహం లేదని తెలుసుకుని తానే తీక్షణంగా చూస్తున్నాడు.

ఇటువైపు చూస్తూ, "మీరు లోపలకు పదండి, టాక్సీని పంపించి వస్తాను" అన్నాడు. ఇంతలోకే టాక్సీ డ్రైవరు తనూ వాగ్వివాదంలోకి అనుకోకుండానే దిగేశారు.

సంతానలక్ష్మి నిలబడ్డ చోటునుంచి కదల్లేదు. కొంచెం అంతే.

అప్పుడే యెవరో ఒకావిడ ఆ యింట్లోంచి అదరాబాదరాగా వచ్చేస్తోంది. ఆమె వస్తున్నట్టు చూసినా కూడా, చూడనట్టుగా, నిర్లక్ష్యంగా, ముభావంగా వుండిపోయారు. ఆమె నవ్వింది. దానికి జవాబులేదు. లోపలికి రండని ఆహ్వానించింది. అప్పటికీ వీళ్ళు కదల్లేదు. శ్రీధర్ రెండు చేతులు పాంట్ రెండు జేబుల్లోకి పోనిచ్చి కళ్లు పైకెత్తి, ఏదో ఆలోచిస్తున్నట్టుగా నిలబడ్డాడు. కాస్తంత శరీరం కుదుపుతో ఊగుతోంది కూడా. అట్లాగే ఒక అడుగు ముందుకు వెయ్యబోయాడో లేదో, సంతానలక్ష్మి మొహం చిట్లించి శ్రీధర్‌వైపు చూసింది, అంతే. అమాంతం రెండు జేబుల్లోనుంచి రెండుచేతులు బైటకు వచ్చేసినాయి. మొహంలో నవ్వూ లేదు, గాంభీర్యం లేదు. బొమ్మలాగ వుండిపోయాడు. ఆమెకు మహా చిరాగ్గా వుంది. ఆ వచ్చినావిడెవరో ఫలానా అని తెలీకపోయినా, ఆ యింట్లోంచి వస్తోంది కాబట్టి, శివకామయ్యగారి సతీమణి అయి వుండొచ్చని వూహించినా, తనకు పరిచయంగాని వ్యక్తితో మాట్లాడటం యిష్టంలేక మెదలకుండా వూరుకుంది. ఇంకా టాక్సీ డ్రైవరుతో చిల్లర పెనుగులాట ముగియలేదు. అర్ధరూపాయి కోసం అరగంట టైమ్ వేస్ట్‌చేసేవాడు, పెళ్లేం చేస్తాడంట అనుకుంది లోపల సంతానలక్ష్మి.

ఎట్లాగయితే తెమిలి బైటపడ్డాడు, యీ టాక్సీవాళ్ళు యెప్పుడూ యింతేనండి అని విసుక్కుంటూ. యిక్కడే నిలబడ్డారేమిటి రండి లోపలికి అంటూ, వర్ధనమ్మవైపు తిరిగి, లోపలకు తీసుకు వెళ్ళకుండా యిక్కడే నిలబెట్టావేమిటి అన్నాడు.

'నేను రమ్మంటూనే వున్నానండి..' తన మీద ఏ మాట వుండకూడదు అన్నట్టు వర్ధనమ్మ యిట్టే సమాధానం చెప్పింది.

శ్రీధర్ యేమి మాట్లాడకుండా, చిరునవ్వు మొహం పెట్టి, మళ్లీ తల్లి

యెక్కడ చూసిపోతుందోనని, ఆమె వెనకాలే అడుగులో అడుగులు వేసు కుంటూ లోపలికి నడిచాడు.

వర్ధనమ్మ, శివకామయ్యకు ఏదో సంజ్ఞ చేస్తోంది. ఆయనకేమీ అర్థంకాల. ఏమిటి అన్నట్లు కనుబొమ్మలు ఎగరేస్తు న్నాడు. ఆమెకు ఎట్లా చెప్పాలో అర్థం కావటంలేదు.

గబగబ గదిలోకి నడిచి ఏమిటి అన్నట్టు భార్యవైపుచూస్తూ ప్రశ్నించాడు.

ఇప్పుడే వస్తానన్నట్టు, సంతానలక్ష్మి వైపు నవ్వుమొహం పెట్టి చూస్తూ, గదిలోకి వచ్చి, యేమిటి కట్టుకోవటం, ధోవతి యెక్కడకు పోయిందో చూసు కున్నారా అని అతి రహస్యంగా చెప్పేసి మళ్ళీ హాలులోకి వచ్చేసింది.

ఓహో అదా! ఎప్పుడూ యీ ధోవతి యింతే. మోకాలు దాటి పైకి ఎగురుతూ వుంటుంది అనుకుంటూ శివకామయ్య ధోవతిని అదుపులోకి తెచ్చి, శరీరానికి ఆచ్ఛాదం కల్పించాడు.

హాలులో వరసగా ఆరు కుర్చీలుముచ్చ టగా కూర్చుని వున్నాయి. వాటికి ఎదురు వరసలో రెండు సోఫాలు పడుకొని వున్నాయి. ప్రక్కప్రక్కనే తల్లీ కొడుకులు రెండు కుర్చీలను భర్తీ చేశారు.

శివకామయ్యవుతే ఓ కుర్చీలో కూర్చున్నట్టే కూర్చుని మళ్ళీ చివాలున లేచిపోతూవుంటాడు. ఏదో ఇట్టే జ్ఞాపకం వస్తుంది. లేస్తాడు. మళ్లీ తిరిగి వచ్చేస్తాడు.

మా పెద్దమ్మాయండి అని వర్ధనమ్మ పరిచయం చేసేలోగానే, నమస్కార మండి అన్నది సునీత. వీపుమీద యెవరో చరిచినట్లనిపించింది శ్రీధర్‌కు. ఆమె కంఠమాదుర్యం అలాంటిది. వెనక్కు తిరిగి చూసుకున్నాడు. శ్రీధర్ ప్రతి నమస్కారం పెట్టేటప్పటికి, సంతాన లక్ష్మికి వళ్ళు మండిపోయింది.

మా అల్లుడు ఢిల్లీలో డిఫెన్స్‌లో వుంటున్నాడు అన్నది వర్ధనమ్మ అదొక పాయింట్‌గా.

ఏమీ చలనం లేదు.

'వచ్చి వారం రోజులయింది. మా పెద్దబ్బాయి గౌహతినుంచి రేపే వస్తు న్నాడు. అందుకనే ఆగారు....'

మంచినీళ్ళు తీసుకురాకపోయినావు... శివకామయ్య ఒక పని పురమాయించాడు. వర్ధనమ్మ మారు మాటాడకండా లోపలికి వెళ్లిపోయింది.

సునీతకు ఎబ్బెట్టుగా వుంది. ఒక్క మాట మాట్లాడరే. అంత మొహమా టస్థులా అనుకుంది. తాను మాత్రం వూరుకోల. తన ధోరణిలో తాను చెప్పుతూనే వుంది.

ఇంతలోకి పళ్లాలు పుచ్చుకుని గదు ల్లోంచి నలుగురు యువతులు కూడ బలుక్కుని వచ్చినట్టు ఒక్కసారిగా వచ్చేశారు. కళ్ళు జిగేలుమన్నాయి శ్రీధర్‌కు. ఒక్కసారిగా వాళ్ళవైపు చూసి, మళ్ళీ తల్లి మొహంలోకి చూస్తూనే వెనక్కు తగ్గాడు. తలొక కాగితం ప్లేటు యిచ్చేశారు. జిలేబిచుట్లు రెండు, పాలకోవ, కారపు జీడిప్పు, ఆ ప్లేటంతా నిండివుంది.

తీసుకోండి అంటున్నారేగాని,యెవరికి వారు యెవరు ముందర స్వీకరించాలో అర్థంకాక మెదలకండా వూరుకున్నారు.

అసలమ్మాయి రానే వచ్చింది. వచ్చీ వచ్చీ శ్రీధర్‌కు సూటిగా యెదురుగా నిలబడి నమస్కారం చేసి మరీ కూర్చుంది. ప్రతినమస్కారం చెయ్య టానికి చేతుల్లో ప్లేటు ఒకటి అడ్డంగా వుంది. అంతకంటె బలమైన కారణం, వాళ్లమ్మ ఓరకంటితో అబ్బాయి చేష్టల్ని కనిపెడుతూనే వుంది. చిరునవ్వుకు ఏమీ అడ్డంలేదు గదా అని ఒకటి విసిరాడు.

'చూపులు కలిసిన శుభవేళ' అనే పాట గుర్తుకొచ్చి, శ్రీధర్‌కు వళ్లంతా చక్కలిగింతలు పెట్టినట్టయింది. ఈ హడావుడిలో ఎవరు ముందర ప్రారం భించారో తెలీదు గాని, ప్లేటు సగం ఖాళీ అయింది.

సంతానలక్ష్మి చప్పున ప్లేటును క్రింద పెట్టేసి, మంచినీళ్ళ గ్లాసును చేతిలోకి తీసుకుంది.


శివకామయ్య కాసేపాగి, అది కూడా తీసుకోండి... ఏమీ బాగాలేదా.. అని పరామర్శ చెయ్యబోయాడు.

జిలేబంటే ఆమెకు వల్లమాలిన ఆకర్షణ. కాని యింట్లో తిన్నట్లు చుట్లు చుట్లు మాయంచేస్తే, వాళ్లేమను కుంటారు అని తమాయించుకుంది.

జిలేబి బాగానే వుంది అంటే, పెళ్ళి కూతురు నచ్చలేదని అనే అర్థం వస్తుం దేమోనని తటపటాయించి, జిలేబి కూడా బాగానే వుంది అన్నామంటే, యీ అమ్మాయి నచ్చిందని వాళ్ళు స్పష్టంగా అర్థంచేసుకుంటారని, ఆ సమయానికి ఎటూ పాలుపోక, అక్కర్లేదండి చాలా ఎక్కువ పెట్టారు అన్నది ముక్తసరిగా. ఈ మాటలేనా సంతానలక్ష్మి అన్నదంటే, కారణం ఒకటే, ఆ అమ్మాయే. కాబోయే పెళ్ళికూతురు. ఆ అమ్మాయిని చూస్తూ, ఆక్షణం తనను తాను మరిచేపోయింది. అందాన్ని చూసి మురిసిపోవటం కాదు.

కాలంనాడు తాను పెళ్ళికూతురు వేషం వేసుకున్నప్పుడు సరిగ్గా యిట్లాగే జరి గింది. ఇంతమంది రావటం, ఏదో ఫలహారాలు అందించటం, మగపెళ్ళివారు ముక్తసరిగా మాట్లాడి వెళ్ళిపోవటం, తీరా మాటపట్టింపువలన ఎప్పుడో జరగా ల్సిన పెళ్ళి వాయిదాలు పడుతూ ఏడాది తర్వాత అవటం,అవన్నీ అప్రయత్నంగా గుర్తుకొచ్చి, ఆమెను ఊగించేసినాయి.

శ్రీధర్ అట్టే పెళ్ళికూతురువంక, అక్కడ కూర్చున్న చెలికత్తెలవంక చూస్తూ పరధ్యానంగా వున్నట్లు నటిస్తూ, ఆలోచించుకుంటున్నాడు. ఇక తాను



ఏమి చెయ్యాలి. తన పాత్ర ఏమిటి అని.

వాళ్ళమ్మ అన్న మాటలన్నీ చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి. పిల్ల నచ్చంగానే సరా! ఎన్ని చూడాలి! వాళ్ళ తాహతు ఏమిటో వాళ్ళ అంతస్థేమిటో చూడొద్దు. ముష్టి పాతికవేలు కూడా యివ్వలేని వాడు పెళ్ళేంచేస్తాడు. రేపు అల్లుడూ, కూతుర్ని యేమాదరిస్తాడు. ఈ రోజుల్లో పాతికవేలంటే, అదొక పెద్ద డబ్బా! అది కూడా యిచ్చుకోలేని వాళ్లతో మన మేమీ మాట్లాడక్కర్లేదు గాని యిహ వెళ్ళిరమ్మనండి అని నిక్కచ్చిగా చెప్పటం, శ్రీధర్‌కు నచ్చిన ఏ సంబంధం కాకండా చెయ్యటం ఓ సారి జరిగిపోయింది.

నువ్వేం దిగులు పడకురా, ఇంతకంటె అందమైన పిల్లను, యింకా యెక్కువ డబ్బు యిచ్చేవాళ్లను చూసి చేస్తాను సరేనా అంటూ కొడుక్కు అభయమిచ్చింది. రంగనాథం అయితే నోరు మెదపలా. అడపెత్తనం అడపెత్తనం అని రెండుసార్లు సణుక్కున్నాడు.

నన్నేం చెయ్యమంటావురా, మీ అమ్మతో పోట్లాడమంటావా, పెళ్ళిచేసుకునేవాడివి నువ్వు. గ్రాయతం వచ్చింది. పోస్ట్‌గ్రాడ్యుయేటు పాసయ్యావు. సెంట్రల్ గవర్నమెంట్‌లో పెద్ద ఉద్యోగం చేస్తున్నావు. నువ్వే నోరు మూసుకు కూర్చుంటే యేదో లోకల్ గవర్నమెంట్‌లో హెడ్‌గుమాస్తాగా చేస్తున్నవాన్ని నే నేమి మాట్లాడగలను అన్న రంగనాథం మాటలకు చెడ్డ కోపం వచ్చింది.

అంటే యిహ, చదువులు, ఉద్యోగాలు, యివేనన్నమాట చూసుకోవాల్సింది. ఇంటికి పెద్దవాడివి, తండ్రివి, నీకే బాధ్యత లేదా, పిల్ల బాగోగులు చూడటం, వాళ్ళ మనస్సేమిటో తెలుసుకోవటం అని అందామనుకుని, తండ్రిని మరింత బాధపెట్టినవాన్నవుతానేమో నని చాలా చాలా నిభాయించుకుని వూరుకున్నాడు.

ఎప్పుడూ తన గొడవే. తను బి.ఏ. ప్యాసయితే, ఒరిగి ఒళ్ళో పడిందేముంది. తన కన్నీ తెలుసుట. మేం యెవ్వరం నోరెత్తటానికి వీల్లేదు. కూర్చోమంటే కూర్చోవాలి నుంచోమంటే నుంచోవాలి. తాను చెప్పింది నెగ్గాలి. ఎప్పుడుచూసినాతన మాటే నెగ్గాలి. ఇహ ఏమన్నా అంటే చూశావా, కని పెంచాను. పెద్దవాన్ని చేశాను. ఎన్ని కష్టాలు పడ్డానో, ఎన్ని బాధలు పడ్డానో యివ్వాళ నీకేం తెలుస్తుంది నాయనా. రెక్కలు వచ్చినాయి గదా యివ్వాళ నేను యెందుకు పనికిరాకుండా పోయాను అని నిష్ఠూరంగా మాట్లాడుతుంది. మాట్లాడితే మాట్లాడనీ, నా యిష్టం అంటూ ఏమీ లేదా.... ఉద్రేకపడ్డాడు శ్రీధర్.

'ఏమిలేదా అంటున్నావేమిటి!....' సంతానలక్ష్మి బిత్తరపోతూ, కొడుకువంక చూసింది.

'అబ్బే ఏంలేదే.. నే నేమన్నాను...' చాలా మెల్లిగా, తల్లికొక్కర్తికే వినిపించేటట్లు అన్నాడు శ్రీధర్.

మా అమ్మాయి ఎం.ఏ. ప్యాసయింది. అప్పుడప్పుడు రేడియోలో పాడుతూ వుంటుంది.

'లలితసంగీతం కాదు....' వాక్యాన్ని పూర్తిచేశాడు శ్రీధర్.

అయితే పేరు విన్నారన్నమాట... అందులో ఒక పెళ్ళయిన అమ్మాయి అందుకుంది.

'ఆడపిల్లన్న తర్వాత ఆ మాత్రం పాటలు పాడటం సర్వసాధారణమే లెండి...' సంతానలక్ష్మికి, ఆ అమ్మాయి గాత్రానికి ప్రాముఖ్యం యివ్వటం యిష్టంలేదని స్పష్టంచేసింది.

అందరూ ఒక్క క్షణం మౌనంగా వుండిపోయారు. రాధిక మనసు చివుక్కుమంది. కాబోయే అత్తగారి అహం మహా ఘాటుగానే వుంది అనుకుంది. శ్రీధర్ ఆ సమయంలో ఒక్కమాట కూడా అనకపోవటం, ఆమె కేమీ నచ్చలేదు. ఆమెంత అంటే, అంతే బహుశా. రాధిక మనస్సు కలవరపడింది.

కాఫీ తాగుతూ, సంతానలక్ష్మి తన మనస్సును ఆ హాలునిండా పరిచేసింది.

'మా వాడికి యిప్పుడు రెండు వేలాస్తాయి నెలకు. రేపో మాపో ప్రమోషన్ కూడా వస్తుంది. ఈ ఊళ్ళో మే ముంటున్న యిల్లు గాక, యింకా రెండు

స్థలాలు కూడా వున్నాయి. రేపల్లెలో ఓ యిల్లుంది. మా పిల్లలు, యిప్పటి పిల్లల మోస్తరు మిడిసిపడే రకం కాదు. నేను యెంత చెపితే అంత. ఈ మధ్యనే ముప్ఫయి వేల దాక యిస్తానని వచ్చారు. డబ్బు ప్రధానం కాకపోయినా డబ్బు కూడా అవసరమే గా....'

పెద్ద తుమ్ము తుమ్ముతూ, హాలులోకి వచ్చిపడ్డాడు ఒకాయన. అందరి కళ్లూ ఆయనమీదే పడ్డాయి.

'మేము యివ్వాళ కొంచెం పనిలో వున్నాం గాని, యివ్వాళ్టికి పాఠం వద్దండి' అంటూ లేచి నిలబడింది వర్ధనమ్మ.

అయినా, యీయనగారు సూటిగా లోపలికి వచ్చేశాడేమిటి రోజూ ఆ ముందు గదిలో కూర్చునేవాడుగా అనుకున్నాడు శివకామయ్య.

ఏమైనాగాని, ఆయన రావటం వలన సంతానలక్ష్మి వాగ్ధాటికి అంతరాయం కలిగింది.

ఇంత నిర్మొహమాటంగా, అందరి యెదట, డబ్బు కావాలని తన తల్లి అడగటం, తన కేమాత్రం నచ్చలేదు. ఐతే ఆమె చేసినపనే తానూ చెయ్యటం ఇష్టం లేక, శ్రీధర్ చాలా యిరకాటంలో పడిపోయి, నలుగుర్లోనూ, తన తల్లిని కించపరచటం బాగుండదని మౌనంగా వుండిపోయాడు.

పాట పాడమంటంగాని, చదువును గురించి అడగటం గాని, యింకా యే ప్రశ్నలయినా వెయ్యటంగాని యేమీలేదు. పెళ్ళిచూపులు అయిపోయినాయి. చివరలకు వచ్చేశారు.

'ఇంత డబ్బు దాహం మంచిది కాదు. మనకూ ఆడపిల్లలున్నారు. వాళ్ళకు పెళ్ళిళ్ళుచెయ్యాలి' అన్నారు రంగనాథం. శ్రీధర్ చెపుతున్నదంతా వింటూ.

'ఏమైనాగాని, వాళ్ళు డబ్బు యిచ్చినా ఇవ్వకపోయినా యీ సంబంధం చేసుకోవటం ఖాయమే నాన్నా' నిక్కచ్చిగా చెప్పేశాడు శ్రీధర్.

'ఈ ముక్కే మీ అమ్మతో చెప్పు. నాతో చెపితే యేంలాభం....'

'అమ్మతో చెప్పలేకే నీతో చెపుతున్నాను....'

'ఇది నీ సొంత విషయం. నీ పెళ్ళి విషయం. నీ మనస్సుకు నచ్చింది, నువ్వు మెచ్చింది పెళ్ళిచేసుకోవటం చాలా సబబు. దీన్నెవ్వరూ కాదనరు. కేవలం డబ్బుకోసం చూసుకుని అప్రతిష్ఠపాలు కావటం అల్లరిపాలుకావటం నా కేమాత్రం యిష్టంలేదు. ఇప్పటికే మీ అమ్మను గురించి నలుగురూ నాలుగు రకాలుగా అనుకుంటున్నారు. నువ్వు కచ్చితంగా చెప్పేసెయ్యి. మాతృదేవోభవ అంటే తల్లికి ఎదురుమాట చెప్పకూడదని కాదు అర్థము. ఈ అరాచకాన్ని, చదువుకున్న వాడివి, నాలుగు రూపాయలు సంపాదిస్తున్నవాడివి, నువ్వే యెదిరించకపోతే యెవరు ముందుకు వస్తారు....' రంగనాథం సూరిపోస్తున్నాడు.

'ఇవన్నీ నాకూ తెలుసు. క్రిందటిసారి ఏమయింది. పెద్ద అఘాయిత్యం చేసి, నా మాట కాదని, వాళ్ళందరి ముందర రభసచేసి, ఆ సంబంధం తప్పించేసిందిగా. వాళ్ళేమో డబ్బివ్వలేకపోయారు. వెళ్ళిపోయారు. అమ్మ ముందర అని ప్రయోజనం యేమిటి!....'

ఈ రెండు రోజులు తెగ మథనపడ్డారు తండ్రీకొడుకులు, తీరా వాళ్ళొస్తే యేం చెప్పాలా అని. ఆ ఘడియ రానే వచ్చింది. శివకామయ్యగారు, వర్ధనమ్మ, యింకో మగాయన వచ్చేశారు. నలుగురూ కూర్చున్న చోటుకు కాఫీలు వచ్చేసినాయి.

'....మా ఆర్థిక పరిస్థితి అంత బాగా లేదు. అయినా పెళ్ళి మీ స్థాయికి తగ్గట్టుగానే చేస్తాము. దాంట్లో యేం లోపం వుండదు. ఏదో మీరు లాంఛనాలు అవీ అంటున్నారు. వాటి విషయంకూడా శాయశక్తులా చూస్తాను. కాని మీ రన్నంత యిచ్చుకోలేమని మాత్రం మనవి చేస్తున్నాను...' నీళ్ళునమిలాడు శివకామయ్య.

'ఈమాటలు వస్తాయనే ముందుగానే మీకు హెచ్చరిక చేశాను. అన్నీ ఆలోచించే నే చెప్పింది ఒప్పుకునే యివ్వాళ యిక్కడికి వచ్చారని అనుకున్నాగాని, మళ్ళీ మీరు ఆ ప్రస్తావనే తీసుకువస్తే, యీ సంభాషణలు ముగిసేదెప్పుడు. దీనికి అంతేముంటుంది....' సంతానలక్ష్మి నిర్మొహమాటంగా చెప్పేసింది.

శివకామయ్య తటపటాయిస్తున్నట్లు చూసి, 'మీరు మరిచేపోయేరేమో, నేమళ్ళీ చెపుతున్నాను. నలభై వేల రూపాలు మా చేతిలో పొయ్యాల్సిందే. తర్వాత లాంఛనాలు వగైరా అదివరకు చెప్పినవే. పెళ్లి మాత్రం ఘనంగా చెయ్యాలి....ముందరే చెపతే సరిపోతుంది....' సంతానలక్ష్మి తలపైకెత్తి అందరివంకా చూసింది.

'ఇప్పటి పరిస్థితుల్లో ఈ మాత్రం యిచ్చుకోకపోతే యెట్లాగులెండి....' రంగనాథం కూడ అనేశాడు.

శివకామయ్యకు నెత్తిన పెద్ద బండరాయి పడ్డట్లయింది. శ్రీధర్‌కు ఆశ్చర్యం వేసింది. ఇదేమిటి నాన్న యిట్లా అనేశాడు. ఓ మూల నన్నేమో, అమ్మతో కచ్చితంగా చెప్పెసెయ్యమని, తానేమో యిట్లా జారుకున్నాడేమిటి అనుకుంటూ ఆరాటపడిపోతున్నాడు. నలుగుర్లో ఏమీ అనలేక చివాలున లేచి, తన గదిలోకి వెళ్ళిపోయాడు.

'ఇదే మీ నిర్ణయము అయితే, మా వలన కాదు.... వస్తాము' అంటూ శివకామయ్య నిట్టూరుస్తూ లేచాడు. వర్ధనమ్మ చాలా దిగులుతో క్రుంగిపోయింది.

'కొంచెం మీరు మళ్లీ ఆలోచించండి' .... మధ్యవర్తిగా వచ్చినాయన మెల్లిగా అందుకున్నాడు.

'మేము అన్నీ ఆలోచించే చెప్పామండి.ఆలోచించి చెప్పాల్సిందిమీరు....'

సంతానలక్ష్మి నదురూబెదురూ లేకుండా అనేసింది.

గదిలో శ్రీధర్ చెల్లెళ్లతో ఉద్రేకంగా మాట్లాడుతున్నాడు.

'అమ్మకు యెట్లా చెప్పాలో అర్థం కావటంలేదు. అసలు కట్నం తీసుకోవటం నేరం. అడిగినవాడు, ఇచ్చినవాడు అందరూ జైల్లోకి పోతారు. డబ్బు మనుషులమని మనమీద యిదొక ప్రచారం...' ఊగిపోతున్నాడు శ్రీధర్.

'అన్నయ్యా వాళ్ళు వెళ్ళిపోతున్నారు....'

శ్రీధర్ కూడా వాకిటి గుమ్మందాకా వచ్చి నిలబడ్డాడు.

'వస్తాను బాబూ....' శ్రీధర్ రెండు చేతులు పట్టుకుని, శివకామయ్య గిర్రున తిరిగివెళ్లిపోయాడు.

మళ్లా రెండురోజులదాక యింట్లో పెళ్లి ప్రస్తావన రాలేదు. యాంత్రికంగా అన్ని పనులు జరుగిపోతున్నాయి. మళ్లీ మూడోరోజే శివకామయ్య ఒంటరిగానే వచ్చి, వాకిటి గుమ్మందగ్గర నిలబడ్డాడు. రంగనాథం ఆయన్ను చూసి లోపలికి తీసుకువచ్చాడు.

'అక్కగారూ, మేము బాగా ఆలోచించి, యెట్లాగయినా యీ సంబంధం కుదరాలనే ఉద్దేశంతో మాకున్న రెండు యకరాల పొలాన్ని అమ్మటాకినినిశ్చయం చేసుకున్నాను. నేను బ్యాంకులో యీ పెళ్లి కోసమని....' వాక్యం ముగించక మునుపే, సంతానలక్ష్మి అందుకుని, 'మీ ఆస్థిపాస్తుల వివరాలు మా కెందుకు చెప్పండి. మొన్నే నేను చెప్పాగదా చెప్పాల్సినదంతా. ఇంకా దీన్ని మరిచి మళ్లా రెండో మాట వుండకూడదు....' అన్నది.

'అవుననుకోండి.... అయినా మళ్లీ ఆశతో వచ్చాను. ఎంత ప్రయత్నం చేసినా ముప్పయికంటే ఎక్కువ యిచ్చుకోలేకండా వున్నాను. ఈ ముక్క చెపుదామనే వచ్చాను.' అన్నాడు.

'మమ్మల్ని బేరాల్లోకి దింపకండి. మీ సంబంధం మాకూ కావాలనే పట్టుదలతోనే మీకు ఆ ముక్క చెప్పాను. కాకపోతే మాకు అంతకంటే యెక్కువ యిచ్చేవాళ్లు కూడా కబురు చేశారు మొన్ననే. మీ విషయం తేల్చుకున్న తర్వాతే ఓ నిర్ణయానికి వద్దామని ఆగాము' అన్నది సంతానలక్ష్మి.

శివకామయ్య యింకా యేదో చెప్పబోతుంటే, మాటకు అడ్డం వచ్చి, 'నన్నేమీ మొహమాటపెట్టకండిఅన్నది.'

'ఓసారి చెప్పింతర్వాత మీరు ఆ విషయాన్ని గురించే పదేపదే ప్రస్తావించటం కూడా అంత సబబుగా లేదు....' రంగనాథం, భార్యకు వత్తాసు పలికాడు.

'మీరూ అంతే అంటారా....'

'అంటే మీ ఉద్దేశం....'

'అబ్బే మీరు ఇంకోలాగా అనుకోవద్దు....'

'మీ మాటలు నాకు అర్థంకావటం లేదు, శివకామయ్యగారు. మా ఆవిడ చెపితే ఒకటి, నే చెపుతే ఒకటా!....' రంగనాథం కనుబొమ్మలు ముడిపడ్డాయి.

శ్రీధర్ బొమ్మలాగ నిలబడి యీ సంభాషణలు వింటున్నాడు.

'అసలు నన్నడగటమే లేదా, నేనో మనిషిని కాదా. నా నిర్ణయం, నా యిష్టాయిష్టాలు యెవరికీ అక్కర్లేదా....'

'ఆగండి. నా నిర్ణయం యేమిటో నే చెపుతాను....' మనసులో గుణించుకున్నాడు. పైకిమాత్రం ఒక్కమాట అనలేకపోయాడు.

మళ్ళీ మర్నాడే వచ్చి, శివకామయ్య నలభైకు వప్పుకుని, వెళ్ళిపోయాడు.

'ఈ నాటకాలు యెవరిదగ్గరా.... చూశావా నే చెప్పింది నిజమా అబద్ధమా! తాహతు లేదని అనక మా దగ్గర బోలెడు ఆస్థి వుందని యెవరైనా చెపుతారా. చివ్వరకు వప్పుకున్నాడా లేదా. నీదంతా తొందర. నా మాట నెరవేరింది. నీకు వచ్చిన పిల్లావచ్చింది.'ఏమంటావు.' కొడుకు మొహంలోకి సగర్వంగా చూసింది.

శ్రీధర్ మొహం విప్పారింది.

'అమ్మా....' అంటూ పసిపల్లాడిలాగ, తల్లి ఒడిలోకి ఒరిగాడు.

సంతానలక్ష్మి కోరుకున్న విధంగానే పెళ్ళి జరిగిపోయింది గాని, అప్పటికీ ఇప్పటికీ కూడా, రంగనాథం, శివకామయ్యకు ఆ నలభై వేలు తిరిగి యిచ్చేశాడని మాత్రం ఆమెకు తెలియదు.

